క్లుప్తంగా

రక్తదాన శిబిరం

పాతమంచిర్యాల: బ్రహ్మకుమారీస్ దాది ప్రకాశమణి స్మృతి దివస్, విశ్వబంధు దివస్ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ ఫేస్ 2లోని బ్రహ్మకుమారీ రాజ యోగ కేంద్రంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 75యూనిట్ల రక్తం సేకరించినట్లు ఐఆర్‌సీఎస్ ప్రతినిధులు తెలిపారు. సేకరించిన రక్తాన్ని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఉపయోగిస్తామన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మంగీలాల్ సోమానీ, ఐఆర్‌సీఎస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, హైటెక్ సిటీ ఫేస్–2 అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ జెండా గద్దెను ధ్వంసం చేసి, గుర్తు తెలియని దుండగులు పైపును ఎత్తుకెళ్లారని సీఐ దేవేందర్ రావుకు ఫిర్యాదు చేసినట్లు చెన్నూర్ బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ తెలిపారు. వారిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, ఆరీఫ్, సురేశ్‌రెడ్డి, మానిశెట్టి శ్రీనివాస్, కొప్పుల రవీందర్, నాయబ్, రవీందర్, బొగె భారతిలు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

పాతమంచిర్యాల: హన్మకొండలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ సదస్సుకు వెళ్తున్న నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం అన్యాయం అని తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జైపాల్‌సింగ్ అన్నారు. తనతో పాటు మరో ఇద్దరిని సభకు వెళ్లకుండా శనివారం అరెస్టు చేసిన పోలీసుల తీరును ఖండించారు. ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

మారథాన్‌లో రఘునాథ్

మంచిర్యాలక్రైం: హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు ఆదివారం మంచిర్యాల బీజేపీ నాయకులు వెరబెల్లి రఘునాథ్‌రావు, ఆయన కూతురు అరుణిమా, గౌతమినగర్‌కు చెందిన బుద్ధినేని స్వరుణ్ 21.1కిలో మీటర్ల మారథాన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వ్యాయామాన్ని తమ దినచర్యల్లో భాగం చేసుకోవాలన్నారు. నేటి యువతకు స్ఫూర్తిగా నిలవడానికి ఏటా రెండు సార్లు మారథాన్ పూర్తి చేస్తానని తెలిపారు.

యోగా పోటీలు



యోగా పోటీల్లో పతకాలు సాధించిన వారితో అసోసియేషన్ సభ్యులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ట్రినిటీ హైస్కూల్లో జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాల, బాలికల విభాగంలో ఆదివారం యోగా పోటీలు నిర్వహించినట్లు యోగా స్పోర్ట్స్ అధ్యక్ష, కార్యదర్శులు అక్కల తిరుపతి వర్మ, మండ శ్రీనివాస్ తెలిపారు. వివిధ స్కూళ్లకు చెందిన 250 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను వచ్చే నెల 4, 5, 6 తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ట్రెడిషనల్ సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఎండీ నేహ గోల్డ్ మెడల్, ఝాన్సీ సిల్వర్ మెడల్, రుచిత కాంస్య పతకం, సబ్ జూనియర్ గర్ల్స్ కే.స్వర్ణమయి గోల్డ్ మెడల్, డీ. వైష్ణవి సిల్వర్ మెడల్, ఈ.స మీక్ష కాంస్య పతకం, రిథమిక యోగా విభాగంలో ఎం.శశివర్ధన్ గోల్డ్‌మెడల్, ఎం.అనిరూప్ వెండి పథకం, అశ్వంత్ కాంస్యపతకం సాధించారు.

మొరాయించిన మోటార్లు



వేమనపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి వచ్చిన వరద రైతుల పంట పొలాలను ముంచెత్తగా బోర్లు, మోటార్లు సైతం వరదపాలయ్యాయి. రాజారాం గోదుంపేట శివారులో ఎడమ కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. వరద కాలువల గుండా దిగువకు వెళ్లకుండా దిశమారి ఎగువకు వచ్చింది. దీంతో రాజారాం గోదుంపేట, వేమనపల్లి, కొత్తపల్లి శివారుల్లో వందలాది ఎకరాల పత్తి, వరి పంటలు వరద పాలయ్యాయి. పొలాల్లో సుమారు 45వరకు బోర్లు, మోటార్లు వరద, బురదతో మునిగిపోయాయి.



తాండూర్: ఎడ్ల ప్రతిమలతో చెరువుకు బయలుదేరిన నేతకానీలు



నెన్నెలలో ఎడ్ల ప్రతిమలను నిమజ్జనం చేయడానికి వెళ్తున్న నేతకానీలు



బెల్లంపల్లిరూరల్: చంద్రవెల్లిలో ఎడ్ల ప్రతిమలను ఊరేగిస్తున్న నేతకానీలు

ఘనంగా బడిగా

నెన్నెల/తాండూర్/బెల్లంపల్లిరూరల్: పొలాల అమావాస్య పురస్కరించుకొని ఆదివారం బడిగా పండుగను ఘనంగా జరుపుకున్నారు. వాడవాడల్లో మేకలు, కోళ్లను కోసుకొని పండుగ వేడుకలు జరుపుకున్నారు. మూడు రోజుల పొలాల అమావాస్యలో భాగంగా రెండో రోజు బడుగాను నిర్వహించారు. ఎడ్ల ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు. పిండివంటలు, పెసర, బబ్బర గారేలను దేవుడికి నైవేద్యంగా సమర్పించారు.

మినీ ట్యాంక్‌బండ్ కళావిహీనం

- నిర్వహణ లోపంతో అడవిని తలపిస్తున్న వైనం
- పూల మొక్కలతో మూసుకుపోయిన వాకింగ్ ట్రాక్
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా చెన్నూర్ మినీ ట్యాంక్‌బండ్



సైడ్ వాల్‌పై పెరిగిన పిచ్చిమొక్కలు

చెన్నూర్: పట్టణ ప్రజలకు ఆహ్లాదం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.6కోట్ల నిధులతో నిర్మించిన మున్సిపాలిటీ పరిధిలోని(పెద్ద చెరువు) మినీ ట్యాంక్‌బండ్ అధ్వానంగా మారింది. నిర్వహణ లోపం కారణంగా మినీ ట్యాంక్‌బండ్ వాకింగ్ ట్రాక్ అడవిని తలపిస్తుంది. ట్యాంక్‌బండ్ ఇరువైపులా ఆహ్లాదకరంగా ఉండేందుకు నాటిన పూల మొక్కలు ఏపుగా పెరిగి, వాకింగ్ ట్రాక్‌పై నడవడం ఇబ్బందిగా మారుతోంది. ట్యాంక్‌బండ్ కింది భాగంలో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన పచ్చని గడ్డి స్థానంలో పిచ్చి మొక్కలు పెరిగి కళావిహీనంగా మారింది. ట్యాంక్‌బండ్ సైడ్ వాల్‌పై పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. కట్టపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో బురదమయంగా మారి పర్యాటకులు, వాకర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

ఆహ్లాదం, ఆరోగ్యం కరువు..

మున్సిపాలిటీలో 25,587మంది జనాభా, 18వార్డులు ఉన్నాయి. పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే మినీ ట్యాంక్‌బండ్ నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో చెరువు నిండిన తర్వాత సాయంత్రం వేళల్లో ట్యాంక్‌ను వీక్షించేందుకు వందలాది మంది పర్యాటకులు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. విద్యుత్ దీపాలు పనికిరాకుండా పోయాయి. మున్సిపల్ అధికారులు స్పందించి విచ్చలవిడిగా పెరిగిన పూల మొక్కలను శుభ్రం చేసి, వాకింగ్ ట్రాక్ పై నీరు నిలువకుండా చర్యలు చేపట్టి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మారింది...



ట్యాంక్‌బండ్‌ను అధికారులు పట్టించుకోవడం లేదు. కట్టపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు నీరు నిలువడంతో ట్రాక్ అంతా బురదమయంగా మారింది. పూల మొక్కలు విపరీతంగా పెరగడంతో వాకింగ్ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి ట్యాంక్‌బండ్‌పై ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టాలి.

\- వొల్లాల సుదర్శన్, చెన్నూర్

వీధిలైట్లు లేక..



వీధిలైట్లు పనిచేయడం లేదు. తెల్లవారుజామున, సాయంత్రం వాకింగ్ చేసేందుకు చీకటిగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. వాకింగ్ ట్రాక్‌తో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారి నా అధికారులు పట్టించుకోవడం లేదు. సైడ్ వాల్ పై పిచ్చి మొక్కలు పెరిగి పాములు సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.

\- ఎ. రాజబాపు, చెన్నూర్

హెచ్‌ఎంఎస్ ద్వైవార్షిక మహాసభలు



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ 26వ ద్వైవార్షిక మహాసభలను ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్నట్లు యూనియన్ కేంద్రం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య తెలిపారు. ఆదివారం ఆయన నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో మహాసభలు జరుగుతాయని, 11 ఏరియాల నుంచి ప్రతినిధులు సభలకు హాజరవుతారన్నారు. కార్మికుల సమస్యలు, సంస్థ పరిరక్షణపై చర్చించి పలు తీర్మానాలు, ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. బొగ్గు గనుల వేలం ఆపి గనులను సింగరేణికే కేటాయించాలని కోరుతూ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన రిఫరల్ మెడికల్ బోర్డులో అర్హులైన కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మహాసభల వాల్‌పోస్టర్ విడుదల చేశారు. యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్, రాజేంద్రప్రసాద్, గొల్ల సత్యనారాయణ, నోముల బాలయ్య, దుర్గం లక్ష్మయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

లక్సెట్టిపేట: ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని లక్సెట్టిపేట ఎస్సై సురేష్ అన్నారు. లక్సెట్టిపేట గురునానక్ ఫంక్షన్ హాల్లో జిల్లా తైక్వాండో ఆధ్వర్యంలో ఆదివారం కరాటే శిక్షణ శిబిరాన్ని ఎస్సై ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అధ్యక్షుడు బుజ్జి రామరావు, మాస్టర్ వెంకటస్వామి, ట్రెజరరీ సుధాకర్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆరీఫ్, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై నేతల దూషణ

- వారికి చెప్పకుండా ఏ పనీ చేయొద్దట..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

మందమర్రిరూరల్: సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఉపరితల (ఓసీ) గనిలో ఓ కార్మిక సంఘం నాయకులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. గనిలో జరిగే చిన్న సంఘటనలు కూడా ఈ నాయకులకు తెలియకపోతే, వారు తోటి కార్మికులను దూషిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శ్రీరాంపూర్ ఓసీపీ నుంచి డిప్యూటేషన్‌పై కేకే ఓసీపీకి వచ్చిన ఈపీ ఆపరేటర్లలో ఒకరు అనారోగ్యంతో ఉండడంతో, షిఫ్ట్ అధికారికి తెలియజేసి మరో ఆపరేటర్‌ను షావెల్ డ్యూటీకి ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలిసిన సంఘ నాయకులు, ''మాకు తెలియకుండా వాహనాలు ఎలా మార్చుకుంటారు?'' అంటూ ఐదారుగురు కలిసి, ఈపీ ఆపరేటర్‌ను ఇతర కార్మికుల సమక్షంలో అసభ్య పదజాలంతో దూషించారు.

పోలీసులకు ఫిర్యాదు..

ఇలాంటి సంఘటనలు గతంలోనూ అనేకసార్లు జరిగినప్పటికీ, యాజమాన్యం ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. బాధిత ఈపీ ఆపరేటర్ ఈ ఘటనను గని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మానవతాదృక్పథంతో వ్యవహరించాల్సిన సంఘ నాయకులు, అమానవీయ రీతిలో తోటి కార్మికుడిని అవమానించడంపై ఇతర కార్మికులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ విషయంపై మందమర్రి ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా, కార్మికుడి నుంచి ఫిర్యాదు అందినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పట్టణ అభివృద్ధి

- ఎమ్మెల్యే గడ్డం వినోద్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే బెల్లంపల్లి పట్టణం మరింత అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంటా చౌరస్తా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వినోద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోటి రూపాయల టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో నిర్మించే చౌరస్తా అభివృద్ధి పనులకు శిలాఫలాకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, రానున్న రోజుల్లో అనేక సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, సీనియర్ నాయకులు మునిమంద రమేశ్, చిలుముల శంకర్, నాతరి స్వామి, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీరాంపూర్: రామకృష్ణాపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ 1992–93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ స్నేహితుని కూతురుకు ఆర్థిక సాయం అందించారు. తమ బాల్యమిత్రుడు కుమ్మరి సదానందం కొద్దికాలం క్రితం మరణించాడు. అతడి కూతురు శ్రీనికకు కర్ణాటకలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో బీటెక్‌లో సీటు లభించింది. దీంతో ఆమె చదువు ఖర్చులకు ఇబ్బంది పడుతుందని భావించి ఖర్చుల కోసం స్నేహితులు పోగుచేసిన రూ.34,702 ఆదివారం శ్రీరాంపూర్‌లోని వారి ఇంటికి వెళ్లి విద్యార్థికి అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆడెపు కృష్ణ కుమార్, గోరంట్ల రవీందర్, వెంకటేశ్వర్లు, గండి సతీశ్, కుదిరే రామస్వామి, శ్రీనివాస్, మామిడాల వెంకటేష్, కనకరాజు రమాదేవి, అనురాధ పాల్గొన్నారు.

'సురవరం' సేవలు మరువలేనివి



శ్రీరాంపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: అనారోగ్య కారణాలతో మృతిచెందిన సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డికి సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని మగ్దూం భవన్‌లో ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ. సీతారామయ్యతో పాటు శ్రీరాంపూర్ బ్రాంచ్ నా యకులు సుధాకర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సురవరం కమ్యూనిస్టు ఉద్యమానికి దిక్సూచిగా నిలిచారన్నారు. ఆయన మరణం తీరని లోటన్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేవన్నారు. దేశం ఓ గొప్ప ఉద్యమకారున్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి నాయకులు మోటపలుకుల రమేశ్, రిటైర్డ్ కార్మికుల సంఘం నాయకులు వేణుమాధవ్ పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: సురవరం సుధాకర్‌రెడ్డి శనివారం మృతి చెందగా ఆదివారం హైదరాబాద్‌లోని మగ్దూం భవన్ వద్ద ఆయన భౌతిక కాయానికి జిల్లా నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిన్నారి వైద్యానికి...

నెన్నెల: మండల కేంద్రంలోని పూసవేర్ల వాడకు చెందిన ఆటో డ్రైవర్ సేని రవి–గీతాంజలి దంపతుల కుమారుని వైద్య ఖర్చుల కోసం ఆదివారం జిల్లా పూసల సంఘం నాయకులు రూ.20వేల ఆర్థిక సాయం అందిచారు. కార్యక్రమంలో పూసల సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుడ్ల సమ్మయ్య, జిల్లా పూసల సంఘం అధ్యక్షుడు ముద్రకోల తిరుపతి, ఉపాధ్యక్షుడు సారయ్య, కోశాధికారి సేని వెంకన్న, సంఘం ప్రతినిధులు ఉన్నారు.

డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలి

మంచిర్యాలక్రైం: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రాజీవ్‌నగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 330డబుల్ బెడ్ రూంలు నిర్మించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో మీడియా, అధికారుల సమక్షంలో పేద వారికి లాటరీ పద్ధతి ద్వారా ఇళ్లను మంజూరు చేశామన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే పేద వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ చొరవ తీసుకొని లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. భవనానికి మరమ్మతు చేయరూ?



భీమారం: మండల కేంద్రంలోని సహకార భవనం శిథిలావస్థకి చేరింది. మరమ్మతులు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్, జైపూర్ | ఫోన్ నంబర్ : 95509 67366

చెట్లకొమ్మల తొలగింపులో ఇష్టారాజ్యం!

- పట్టించుకోని అధికారులు



మిషన్‌తో కోసిన రావిచెట్టు కొమ్మలు



అక్రమంగా వాహనంలో తరలిస్తూ...

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ నుంచి లక్సెట్టిపేట మండలం కొత్తూర్ గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన భారీ వృక్షాల కొమ్మలను గుర్తు తెలియని వ్యక్తులు ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అనుమతులు లేకుండా రంపపు మిషన్ల సాయంతో కొమ్మలు నరికేస్తున్నారు. వాటిని దర్జాగా క్రేన్ల సాయంతో ట్రాలీల్లో ఎక్కించి తరలించాల్సిన చోటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని ముత్యంపేట అటవీ చెక్‌పోస్టుకు కూతవేటు దూరంలో భారీ వృక్షాల కొమ్మలు కోస్తున్నా వారేమి పట్టించుకోవడం లేదు. పైగా కోసిన కొమ్మలను వాహనాల్లో లోడ్ చేసి చెక్‌పోస్టు దాటి వెళ్తున్నా అటవీశాఖ అధికారులు మామూలుగా వ్యవహరిస్తూ అక్రమార్కులకు సహకరిస్తున్నారు. దీంతో భారీ వృక్షాల చెట్ల కొమ్మలు కోయడంతో కొన్నిచోట్ల మొదళ్లు మాత్రమే మిగులుస్తున్నారు. ఈ విషయంలో ఆర్ అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోతే మాత్రం రోడ్డుపక్కన ఉన్న భారీ వృక్షాలను అక్రమార్కులు కొమ్మల పేరుతో చెట్లను మాయం చేసేలా ఉన్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ సునీల్‌ను ఫోన్‌లో సంప్రదించగా చెట్ల కొమ్మల తొలగింపులకు ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గుంత పూడ్చివేత

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో తహసీల్దార్ కార్యాలయం మూలమలుపు వద్ద కొన్ని నెలల క్రితం గుంత ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. స్థానిక ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు ఆదివారం సొంత ఖర్చులతో శ్రమదానం చేసి ప్రమాదకర గుంతను పూడ్చివేశారు.